## చట్టానికి పొగ పెడుతున్నారు!



మహబూబ్‌నగర్‌లోని ఓ టీ షాప్ వద్ద సిగరెట్ తాగుతున్న యువకులు

క్లిక్.. క్లిక్..

స్మోకింగ్ రాయుళ్లు చట్టానికి పొగ పెడుతున్నారు.. బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగడం నేరమని, తాగితే జరిమానా చెల్లించాలని హెచ్చరిస్తున్నా డోంట్ కేర్ అంటున్నారు.. బస్టాండ్లు, టీ స్టాళ్లు, హోటళ్లు, రోడ్లు, పాన్ డబ్బాలు ఇలా కాదేదీ అనర్హమన్నట్లు ఎక్కడ పడితె అక్కడ బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్లు, బీడీలు తాగుతున్నారు. దమ్ మారో దమ్.. అంటూ రైల్ ఇంజన్ లా పొగను వదులుతున్నారు. పొగ తాగుతున్న వారి కంటే పక్కన ఉన్న వారికి ఎక్కువ హాని కలిగిస్తుందన్న సంగతి మరుస్తున్నారు.. గత్యంతరం లేక పక్కన ఉన్న వారు ముక్కు మూసుకోవడమో, లేదంటే అక్కడి నుంచి పక్కకు వెళ్లడమో చేస్తున్నారు. చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి, బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నేడు ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా మహబూబ్‌నగర్, వనపర్తిలలో 'ఆంధ్రజ్యోతి' తీసిన ఫొటోలు కొన్ని..



- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, మహబూబ్ నగర్/వనపర్తి





వనపర్తిలో పొగ తాగుతున్న వ్యక్తులు

# కుర్చీలు వదలండి!



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రంలో(ఎడమ నుంచి) నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్, మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, పర్ణికారెడ్డి

- ఆఫీసులోనే కూర్చుంటే క్షేత్రస్థాయి సమస్యలెలా తెలుస్తాయి..
- ఉదయం ఒక గంట ఆఫీసుకు ఆలస్యంగా వచ్చినా మంచిదే..
- భూ భారతి తెస్తున్నా రెవెన్యూ సమస్యల కాలయాపన ఏంటి ?
- పేదలు కట్టుకున్న ఇందిరమ్మ ఇళ్లకు కొలతల సమస్య రావొద్దు
- డాక్టర్ల నుంచి అంబులెన్స్ డ్రైవర్ల ప్రైవేటు దందాపై అసహనం
- విద్య, వైద్యం, రెవెన్యూపై ప్రతీవారం కలెక్టర్ సమీక్ష చేయాలి
- సమీక్ష సందర్భంగా జిల్లా అధికారులపై మంత్రుల ఆగ్రహం

మహబూబ్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : అధికారులు ఆఫీసుల్లోనే కూర్చోకుండా కుర్చీలు వదిలి క్షేత్రస్థాయికి వెళ్తేనే ప్రజలు నిజంగా ఎదుర్కొంటున్న సమస్యలు తెలుస్తాయని, లేకపోతే దిగువస్థాయి సిబ్బంది ఇచ్చే సమాచారంపైనే ఆధారపడాల్సి వస్తుందని మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు మహబూబ్‌నగర్ జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం లేచిన తర్వాత ఏదైనా ఒక మండలం విజిట్ పెట్టుకోవాలని, అవసరమైతే ఆఫీసుకు ఒక గంట ఆలస్యంగా వచ్చినా మంచిదేనని హితవు పలికారు. చిన్న జిల్లాలు అయిన తర్వాత చివరి గ్రామం వెళ్లడానికి కూడా 40 నిమిషాల కంటే ఎక్కువ సమయం పట్టదని, కానీ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో శుక్రవారం మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల అధికారులతో వ్యవసాయ కార్యాచరణ, వడ్ల కొనుగోలు, అంటువ్యాధులు, భూభారతి సదస్సులు, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ తీరు మార్చుకోకపోతే ఇబ్బందులు పడతారని, ప్రజా సమస్యల పరిష్కారంలో కాలయాపన చేయడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుందని హెచ్చరించారు. రెవెన్యూ విభాగంలో ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయిస్తే క్షేత్రస్థాయిలో ఎమ్మార్వోలు, ఆర్డీవోలు, అడిషనల్ కలెక్టర్లు సమస్యలను పరిష్కరించకుండా నాన్చుతున్నారని, పైరవీలు ఉంటేనే పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం తహసీల్దార్‌ను రైతు సంప్రదిస్తే అక్కడి నుంచి ఆర్డీవో దగ్గరకు అక్కడి నుంచి అడిషనల్ కలెక్టర్ వద్దకు, ప్రజావాణిలో దరఖాస్తు చేసినా ఇదే తరహాలో తిప్పుతూ ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అప్పు తెచ్చి పేదవారు కొంత ఎక్కువ విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకుంటుంటే అధికారులు ఇబ్బందులు పెట్టవద్దని ఎమ్మెల్యేలు అధికారులకు తెలియజేశారు. వారు పేదవారా? ఇంటి మంజూరుకు అర్హులా కాదా? అనే విషయాలనే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఇల్లు మంజూరై నిర్మించుకోని వారు సహేతుకమైన కారణాలు చూపించకపోతే వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రులు ఆదేశించారు.

**వైద్యారోగ్యశాఖపై సీరియస్...**

సీజనల్ వ్యాధులు విపరీతంగా ప్రబలే ప్రమాదం ఉన్నా ఇప్పటివరకు జిల్లా యంత్రాంగం నిర్దిష్టంగా ప్రణాళిక చేయలేదని మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో శానిటేషన్, సీజనల్ వ్యాధులు ప్రబలే పరిస్థితి ఎక్కువగా ఉందని, కానీ

(మిగతా 4లో..)

**చేయాలండి.. చేస్తామండి...**

మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల సమీక్ష సందర్భంగా కొందరు అధికారులు చాలా ఉదాసీనంగా వ్యవహరించారని ఎమ్మెల్యేలు పలువురు అభిప్రాయపడ్డారు. సమీక్షలో ఫలానా చోట సమస్య ఉన్నదని చెప్పి, పరిష్కరించాలని సూచిస్తే పరిష్కరిస్తామని చెప్పడం తప్పా నిర్దిష్టంగా ప్రణాళిక అధికారుల నుంచి వెలువడటం లేదని అంటున్నారు. చాలావరకు క్షేత్రస్థాయి సమస్యలను ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు చెబితే తప్పా అధికారులకు తెలియడం లేదని, ఎవరైనా తెలిసిన వారి ద్వారానో లేదా పైరవీలు చేస్తే మాత్రమే అధికారుల వద్ద పనులు అవుతున్నాయని పెదవి విరుస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రులు అధికారులు కేవలం కుర్చీలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయికి వెళ్లి గ్రౌండ్ రిపోర్టు తీసుకోవాలని సూచించారని స్పష్టమవుతోంది.

### ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు
- గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం మునగాల శివారులో ఘటన

4

### చిరుత పులి దాడి

- రెండు లేగ దూడలు మృతి
- పరిశీలించిన సెక్షన్ అధికారి
- నవాబ్‌పేట మండలంలో మరోసారి చిరుత అలజడి
- గతంలో బోన్ ఏర్పాటు చేసినా చిక్కని చిరుత

5

### చోరీ కేసులో మూడేళ్ల జైలు శిక్ష

- రూ.200 జరిమానా
- ఇంట్లోని పూజ గదిలో ఉన్న హుండీని పగులగొట్టి రూ.1,500 అపహరించినందుకు..


5

### వేటాడితే కఠిన చర్యలు

- ఉడుములను వేటాడిన నలుగురు అదుపులోకి..
- పట్టిన వాటిలో 3 ఉడుములు చనిపోగా 6 బతికి ఉన్నట్లు గుర్తింపు

5

### శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద



- జలాశయంలోకి 19 వేల క్యూసెక్కులకు పైగా నీరు
- ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న ఉత్పత్తి

4

## చేనేత కార్మికులకు అండగా ఉంటా

- అహిల్యాబాయి జయంతిలో ఎంపీ డీకే అరుణ



మాట్లాడుతున్న అరుణ

నారాయణపేట టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు అండగా ఉంటానని ఎంపీ డీకే అరుణ అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం అహిల్యాబాయి జయంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డీకే అరుణ హాజరై అహిల్యాబాయి చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నారాయణపేట పరిధిలో కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించే బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందన్నారు. ఎవరికైనా పెన్షన్, ఇతర ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. చేనేత కార్మికులకు చేయూత ఇచ్చేందుకు టెక్స్‌టైల్, హ్యాండ్లూమ్ పార్క్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే బీజేపీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నాగూరావు నామాజీ, రతంగ్ పాండురెడ్డి, పడాకుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, లక్ష్మి శ్యాంసుందర్, వినోద్ పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

- గత ఏడాది యాసంగి కంటే 400 శాతం అధికంగా..
- 2023-24లో 37,480 మెట్రిక్ టన్నులు కొనుగోలు
- ఈ ఏడాది 1,90,558.120 మెట్రిక్ టన్నులు..
- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేటటౌన్,మే30,(ఆంధ్రజ్యోతి): యాసంగిలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్లు నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2024-25 యాసంగి సీజన్‌కు సంబంధించి గత సంవత్సరం యాసంగి కంటే 400 శాతం అధికంగా కొనుగోలు కేంద్రాల సేకరణ చేసినట్లు చెప్పారు. గత యాసంగి 2023-24 సీజన్‌లో 28.05.2024 నాటికి 37,480 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 7,787 మంది రైతులకు రూ.86.95 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. ఈ యాసంగి సీజన్‌లో 28.05.2025 నాటికి 100 కొనుగోల కేంద్రాల నుంచి ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 1,90,558.120 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 27,086 మంది రైతుల నుంచి ఆ ధాన్యం కొనుగోలు చేయగా, 23,553 మంది రైతులకు ఇప్పటి వరకు రూ.389.07 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. ఐకేపీ ద్వారా 5,720 మెట్రిక్ టన్నులు, పీఏసీఎస్ ద్వారా 1,24,696 మెట్రిక్ టన్నులు, మెప్మా ద్వారా 4,914 మెట్రిక్ టన్నులు, ఎఫ్‌పీవో ద్వారా 1,916 మెట్రిక్ టన్నులు, ఏఎంసీ ద్వారా 1,828 మెట్రిక్ ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. అందులో దొడ్డు రకం 54,039 మెట్రిక్ టన్నులు కాగా, సన్న రకం 1,36,518 మెట్రిక్ టన్నులని చెప్పారు. జిల్లాలో కొనుగోలు తుది దశకు చేరుకుందన్నారు. సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తున్నందున రైతులు దళారులకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించారని చెప్పారు. సన్న రకం ధాన్యం సాగు కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ధాన్యాన్ని 43 మిల్లులకు టాగ్ చేసి, ధాన్యం రవాణా చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణకు 4,84,8,066 గన్ని బ్యాగులు పోజిషన్ చేయగా 4,76,3,953 బ్యాగులు కొనుగోలు కేంద్రాల్లో వినియోగించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ట్యాబ్ ఎంట్రీ కూడా 100 శాతం పూర్తి, చేసి రైతుల ఖాతాలో పూర్తి స్థాయిలో డబ్బులు జమ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మిగిలి ఉన్న ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి, మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. అకాల వర్షాలకు రైతులు అధైర్య పడవద్దని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండి ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## రూ.65.70 లక్షలకు చికెన్ వ్యర్థాల టెండరు

- దక్కించుకున్న గద్వాలకు చెందిన వ్యక్తి

మహబూబ్‌నగర్, మే 30 (ఆంధ్రజ్యోతి): పాలమూరు కార్పొరేషన్ పరిధిలో చికెన్ వ్యర్థాలకు శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటలో పరశురాములు రూ.65.70 లక్షలకు టెండర్ దక్కించుకున్నాడు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. నలుగురు వ్యక్తులు వేలం పాటలో పాల్గొన్నారు. గద్వాలకు చెందిన వ్యక్తి పరశురాములు అత్యధిక డబ్బులు వేలం పాడి, టెండర్ దక్కించుకున్నాడు. జూన్ 1 నుంచి మార్చి 31 వరకు గడువు ఉంటుంది. కార్పొరేషన్ పరిధిలో 200లకు పైగా చికెన్ దుకాణాలు ఉంటాయి. ఫిష్, మటన్ వ్యర్థాలు కూడా ఈ టెండర్ పరిధిలోనే ఉండగా, చికెన్ వ్యర్థాలే ప్రధానంగా ఉంటాయి. గతేడాది అధికార పార్టీ నాయకులు కేవలం రూ.15 లక్షలకే టెండర్ దక్కించుకున్నారు. ఇది కాస్త వివాదాస్పదం కావడంతో ఆ తరువాత నిర్వహించిన టెండర్ రూ.50 లక్షల వరకు పాడి దక్కించుకున్నారు. ఇప్పుడు పది నెలల కాలానికే రూ.65.70 లక్షలకు టెండర్ పాడారంటే చికెన్ వ్యర్థాల ఆదాయం ఏ స్థాయిలో ఉన్నదో అర్థమవుతోంది.

## అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ టౌన్, మే 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జూన్ 2న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్ ఎస్పీ జానకితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణ లేదా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే కార్యక్రమాల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. లోటు పాట్లకు తావులేండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబేలా వివిధ శాఖలు ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు శాఖల అధికారులు పాల్గొన్నారు.

### భర్త దాడిలో భార్య మృతి

4

## చాంపియన్ మహబూబ్‌నగర్

- 52 పరుగుల తేడాతో నారాయణపేటపై గెలుపు
- ముగిసిన క్రికెట్ 2డే లీగ్ టోర్నమెంట్



గెలిచిన మహబూబ్‌నగర్ జట్టుతో ఎండీసీ సెక్రటరీ రాజశేఖర్, కోశాధికారి ఉదేష్‌కుమార్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 30 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అండర్-23 ఉమ్మడి జిల్లా 2డే లీగ్ టోర్నీలో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. మహబూబ్‌నగర్ జట్టు 52 పరుగుల ఇన్నింగ్స్ తేడాతో నారాయణపేటపై విజయం సాధించింది. జిల్లా కేంద్రంలోని సమర్థ పాఠశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 49.5 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జట్టులో అక్షయ్ 103 బంతుల్లో 2 ఫోర్లతో అర్ధ సెంచరీ (63) సాధించాడు. సంతోష్‌నాయక్ 28, ఆర్యన్ 34 పరుగులు చేశాడు. నారాయణపేట బౌలర్లలో హరీశ్ 3, ప్రదీశ్, కార్తీక్‌గౌడ చోరో రెండు వికెట్లు తీశారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన నారాయణపేట జట్టు 24.2 ఓవర్లలో 72 పరుగులకు మహబూబ్‌నగర్ బౌలర్ల దాటికి కుప్పకూలింది. జట్టులో లోకేశ్ 23, ఆర్యన్ 12 పరుగులు చేశారు. మహబూబ్‌నగర్ బౌలర్లలో ముఖిద్ 4, షాదాబ్‌అహ్మద్ 3, శశాంక్ 2 వికెట్లు తీసి రాణించారు. ఫాలో ఆన్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నారాయణపేట జట్టు 17.5 ఓవర్లలో 84 పరుగులకు ఆలౌట్ అయ్యింది. 52 పరుగుల ఇన్నింగ్ తేడా మహబూబ్‌నగర్ ఘన విజయం సాధించింది. 22 పాయింట్లు సాధించి చాంపియన్‌గా నిలిచింది. మహబూబ్‌నగర్ బౌలర్లలో ముఖీద్ రెండో ఇన్నింగ్స్‌లో చెలరేగి, 6 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కే. శ్రీకాంత్ 2, మనోజ్‌యాదవ్, ఎ. శ్రీకాంత్ చోరో వికెట్ తీశారు.

**జిల్లా క్రీడాకారులు రంజీకి ఎదగాలి:** క్రీడాకారులు రంజీ జట్టుకు ఎంపిక కావాలని క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. మహబూబ్‌నగర్-నారాయణపేట జట్ల మధ్య మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు.

## ముందస్తుగానే వరద

# గుర్రంగడ్డ దిగ్బంధం

- గ్రామాన్ని చుట్టుముట్టిన కృష్ణమ్మ
- కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు
- అంతకు ముందే ధాన్యం తరలింపు
- ఎరువులు, విత్తనాలు తెచ్చుకోని రైతులు



నీటిలో మునిగిపోయిన గుర్రంగడ్డ నిర్మాణ బ్రిడ్జి

గద్వాల, మే 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మకు వరద పోటెత్తింది.. జోగుళాంబ గద్వాల జిల్లాలోని గుర్రంగడ్డ గ్రామాన్ని చుట్టుముట్టింది. ఈ ఏడాది అకాల వర్షాలు, ముందే వచ్చిన రుతుపవనాలతో కృష్ణానదికి ముందస్తుగానే వరద పోటెత్తింది. దీంతో గురువారం రాత్రి జోగుళాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టు 12 గేట్లను ఎత్తి 83 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. రాత్రి 11 గంటల తర్వాత ఆ వరద గుర్రంగడ్డను చుట్టుముట్టింది. దీంతో కృష్ణానదిలో రంగాపురం వైపు వేసిన తాత్కాలిక రహదారి కొట్టుకుపోయింది. గ్రామానికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ప్రతి సంవత్సరం జూన్ చివర లేదంటే జూలైలో వరద ప్రారంభమై, ఆగస్టులో లక్షల క్యూసెక్కులకు చేరేది. అప్పటి వరకు గ్రామ రైతులు ధాన్యాన్ని విక్రయించుకొని వచ్చిన డబ్బుతో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి నిల్వ చేసుకునేవారు. కానీ చాలా ఏళ్ల తర్వాత మే చివరలోనే కృష్ణానదికి వరద రావడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు.

### ప్రైవేట్ వాహనాల్లో ధాన్యం తరలింపు

గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడ ధాన్యం కాంటా అయినా, లారీల కొరతతో మిల్లులకు చేరలేదు. అకాల వర్షాలతో జూరాలకు వరద వస్తున్నదన్న విషయంపై ఇరిగేషన్ అధికారులతో పాటు కలెక్టర్ బీఎం సంతోష్‌కు సమాచారం ఉంది. అందుకే కలెక్టర్ బుధవారం గుర్రంగడ్డను సందర్శించి, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో జూరాల గేట్లను ఎత్తి దిగువకు నీళ్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటన రావడంతో కేంద్రం నిర్వాహకులతో పాటు రైతుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. ధాన్యం బయటకు పోవాలంటే హమాలీలు, ప్రైవేటు డీసీఎంలు అవసరమని నిర్ణయించారు. రంగాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి హమాలీలను పిలిపించారు. లారీ అసోషియేషన్ వారితో మాట్లాడి ఎనిమిది డీసీఎం వాహనాలను తెప్పించారు. రాత్రి పది గంటల వరకు ఏడు డీసీఎంల ధాన్యం లోడ్‌ను బయటకు తరలించారు. మరో డీసీఎం ఉండగానే గుర్రం గడ్డను నీళ్లు చుట్టుముట్టాయి. అతికష్టం మీద దానిని కూడా బయటకు తీసుకొచ్చారు.

### నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం

శరవేగంగా సాగుతున్న గుర్రంగడ్డ బ్రిడ్జి నిర్మాణ పనులకు బ్రేక్ పడింది. ఈ ఏడాది పిల్లర్ల నిర్మాణంతో పాటు కొంతమేర స్లాబ్‌కు బేస్ వేసుకోవాలనే ఆలోచనతో నిర్మాణ సంస్థ పనులను వేగవంతం చేసింది. వరద వచ్చేనాటికి ఒక రూపం తేవాలనే ఆలోచనలో ఉన్నది. కానీ జూరాలకు ముందస్తుగానే వరద రావడంతో సాయంత్రం పనులను నిలిపివేసి నిర్మాణ సామగ్రితో పాటు వాహనాలను నది పక్కనే ఉన్న క్యాంపునకు తరలించారు. మళ్లీ వచ్చే జనవరి లేదా ఫిబ్రవరిలోనే పనులు జరిగే అవకాశం ఉంది. ఆ ఏడాదైనా పనులను వేగవంతం చేస్తే బ్రిడ్జి నిర్మాణం పూర్తి అవుతుంది. లేదంటే మరో ఏడాది ఎదురు చూడాల్సి వస్తుంది.

### ఎరువులు, విత్తనాల కోసం పరుగులు

ముందస్తు వరదలు రావడంతో జూరాల గేట్లు తెరుచుకున్నాయి. దీంతో దీవి గ్రామ రైతులు ఎరువులు, విత్తనాలకోసం పరుగులు పెట్టారు. ఇరిగేషన్ అధికారులు సాయంత్రం 4 గంటలకు సమాచారం ఇవ్వడం తో ఖరీఫ్ సాగుకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను తెచ్చుకునేందుకు ట్రాక్టర్లలో పెబ్బేరు, ఎర్రవల్లి, గద్వాల ప్రాంతాలకు చేరుకున్నారు. ధాన్యం విక్రయించినప్పటికీ ఇంకా రైతుల చేతికి నగదు అందకపోవడంతో ఎరువుల దుకాణాదారుల వద్ద ఉద్దెరకు ఆగచాట్లు పడ్డారు. పెద్దఎత్తున వ్యవసాయం చేసే రైతులు రాత్రి వరకు గ్రామంలోకి ఎరువులు, విత్తనాలను చేర్చుకు న్నారు. కానీ చిన్నకారు రైతుల చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం, ధాన్యం డబ్బు చేతికి అందకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. దీంతో డబ్బులు వచ్చిన తర్వాత పవర్ బోట్‌లో తరలించుకోవచ్చనే ఆలోచనలో ఉ న్నారు. గ్రామంలోని ట్రాక్టర్లు మినహా ఇతర ద్విచక్రవాహనాలు, ఫోర్ వీలర్ వాహనాలను సాయంత్రమే నది దాటించి ఒడ్డుకు చేర్చారు. వాటితో గద్వాల, ఇత ర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి మార్గం సుగమమైంది.

## నన్ను ఎలాగైనా పాస్ చేయాలి సార్...

# దండం పెడతా..

- పీయూ పరిధిలోని ఓ కళాశాల విద్యార్థిని జవాబు పత్రంలో వేడుకోలు
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టు

పాలమూరు యూనివర్సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీలో డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆరవ సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో ఓ కళాశాలకు చెందిన విద్యార్థిని పరీక్ష జవాబు పత్రంలో ప్రశ్నలకు జవాబు తెలికపోవడంతో " సారు నన్ను ఎలాగైనా పాస్ చేయాలి సారు.. నేను నీ కూతురు లాంటిదాన్ని సార్... ఒక పేదింటి బిడ్డను సార్.... మేము ఫీజులు కట్టలేక పోతున్నాము సార్... మీకు పుణ్యం ఉంటుంది సార్.. ధన్యవాదాలు సారు... నన్ను దయచేసి పాస్ చేయండి సార్... నేను ఇప్పుడు ఫైనల్ ఇయర్ సార్.... మళ్ళీ ఒక సంవత్సరం వృథా అవుతుంది సార్.. ధన్యవాదాలు సార్... అని రాసిన తీరు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అత్యంత పకడ్బందీగా జవాబు పత్రాల స్కానింగ్, మూల్యాంకనం జరుగుతుంది. కానీ ఆ విద్యార్థిని రాసిన జబాబు పత్రం ఎలా బయటకు వచ్చిందనేది కూడా లేలాల్సి ఉంది. సంబంధిత పరీక్షల అధికారులు మాత్రం ఇప్పుడు తమకేమీ తెలియదన్నారు

## వరి నారు పనులు ప్రారంభించాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులు వెంటనే వరి నారు పనులు ప్రారంభించుకోవాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూరాల ప్రాజెక్టు నిండటంతో గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారని పేర్కొన్నారు. జూరాల ద్వారా ఉమ్మడి జిల్లాలోని భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ తదితర ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో సాగు నీరు పుష్కలంగా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో తొందరగా వరి నార్లు పోసుకుంటే మంచి దిగుబడి వస్తుందని, కోతలు కూడా తొందరగా పూర్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆ తర్వాత రబీ సీజన్‌లోనూ తొందరగా వ్యవసాయ పనులు ప్రారంభించే అవకాశం ఉంటుందని తెలిపారు. అప్పుడు ఉండే అధిక ఎండలతో పాటు వడగళ్ల వానల నుంచి తప్పించుకునే వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు. జూరాలతో పాటు ఇతర ప్రాజెక్టుల నుంచి సాగునీటిని రైతులకు సమానంగా అందించాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. రైతులకు విత్తనాలను సకాలంలో అందించాలని, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్ జిల్లా పరిధిలోని మినీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్రాబాద్, జడ్చర్ల, బిజినేపల్లి, లింగాల, గండీడ్ గురుకులాల్లో 1, 2, 5 తరగతులలో బ్యాక్‌లాగ్ ఖాళీల్లో చెంచు గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులకు చివరి తేదీ 6 అని తెలిపారు. 9న లాటరీ ద్వారా విద్యార్థుల ఎంపిక, 12న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం ఆయా పాఠశాలల ప్రధానాచార్యులను సంప్రదించాలని సూచించారు.

## వీధి కుక్కల స్వైర విహారం

- పలువురికి గాయాలు

జడ్చర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మునిసిపాలిటీలో వీధి కుక్కలు శుక్రవారం స్వైర విహారం చేశాయి. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో నలుగురు చిన్నారులతో పాటు ఇద్దరు వ్యక్తులపై వీధి కుక్క దాడికి చేసింది. దీంతో ఓ మహిళకు తీవ్రగాయాలు కాగా, అత్యవసర చికిత్స కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. సత్యనారాయణస్వామి దేవాలయ సమీపంలో ఓ మహిళను వీధి కుక్క తీవ్రంగా గాయపరిచింది. బాధితులను జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో నర్సు చికిత్స చేశారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలి

- తిమ్మారెడ్డిపల్లి తండాలో నిరసన



తిమ్మారెడ్డిపల్లి తండాలో ఖాళీ కడవలు , డబ్బాలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఊట్కూర్, మే 30 ( ఆంధ్రజ్యోతి) :, గ్రామంలో తాగు నీటి సమస్యను పరిష్కరించాలని నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి తండా మహిళలు డిమాండ్ చేశారు. ఖాళీ బిందెలు, డబ్బాలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు సంతోష్‌రాథోడ్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో మూడు రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో తాము వ్యవసాయ బోర్లు, బావుల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. ఉన్నత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శి అరుణజ్యోతి మాట్లాడుతూ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో ఓ వ్యక్తి చనిపోవడంతో గ్రామస్థులే ఒద్దని చెప్పారని, అందుకే ఈ రోజు నీరు సరఫరా చేయలేదని చెప్పారు.

## ప్రజాపోరాటాలు చేస్తున్నందుకే మాపై కేసులా?

- విలేకరుల సమావేశంలో బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపోరాటాలు చేస్తున్నందుకే తమ పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారా అని బీఎస్పీ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు కల్యాణ్, అసెంబ్లీ ఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్, జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్‌లు అన్నారు. బీఎస్పీ నాయకులపైఅక్రమ కేసులు సహించబోమని వారు స్పష్టం చేశారు. బీఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక దేవకీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామంలో జరిగిన ఒక సంఘటన ఆధారంగా బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబరు పృథ్వీరాజ్‌పై అక్రమ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. తడిసిన ధాన్యం కొనమని, మునిసిపాలిటీ అవినీతి విషయంలో పేదల డబ్బాల విషయంలో ముందుండి కొట్లాడుతున్నందున కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధంగా కసి తీర్చుకుంటుందా అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ నియోజకవర్గ కోశాధికారి భాస్కర్, నాయకులు బాలనాగులు, గుంత భాస్కర్, రాంచందర్, నాగరాజు, బాలయ్య, వెంకటేశ్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

## కారు, ద్విచక్ర వాహనం ఢీ

వెల్దండ, మే 30 (ఆంధ్రజ్యోతి) : కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఏడుగురు గాయపడ్డారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండల కేంద్రం సమీపంలో శుక్రవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. అచ్చంపేటకు చెందిన మహేశ్వరి, దేవాన్ష్, 8 నెలల చిన్నారితో కలిసి కారులో హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు వస్తున్నారు. వనపర్తికి మండలం, పెద్దదగడకు చెందిన చంద్రశేఖర్, రిషిక, మానస, గోపాల్‌పేట మండలం ఏదులకు చెందిన నాగరాజు ద్విచక్రవాహనంపై కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ వెల్దండ సమీపంలోని వీజేఆర్‌హోటల్ వద్ద ఢీకొన్నాయి. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురూ స్వల్పంగా గాయపడారు. డ్రైవర్ కేతావత్ బిచ్యానాయక్ క్షేమంగా బయటపడ్డాడు. ద్విచక్రవాహనంపై వస్తున్న నలుగురికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుప త్రికి తరలించారు.

## ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు

- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు





మృతులు శ్రావణి, సాయిచైత్ర (ఫైల్)

ఎర్రవల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఆగిఉన్న లారీని కారు ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది.

ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ కథనం ప్రకారం ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.





ఆగిఉన్న లారీని ఢీకొని నుజ్జునుజ్జయిన కియా కారు

మేడ్చల్ జిల్లా నిజాంపేటకు చెందిన వెంకటబాబ్జి తన భార్య శ్రావణి (38), కూతుళ్లు లక్ష్మీసహస్ర, సాయిచైత్ర(6)లతో కలిసి విహార యాత్ర కోసం ఈ నెల 24వ తేదీన ఊటీ వెళ్లారు. తిరిగి గురువారం ఉదయం అక్కడి నుంచి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కియా కారు మండలంలోని మునగాల గ్రామ శివారులో శుక్రవారం తెల్లవారుజామున 6 గంటల ప్రాంతంలో ఎలాంటి ముందస్తు సూచికలు లేకుండా రోడ్డు పక్కనే ఆగిఉన్న లారీని అతివేగంగా వచ్చి ఢీకొన్నది.

దీంతో శ్రావణి అక్కడికక్కడే మృతి చెందగా చిన్న కూతురు సాయి చైత్రను చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మృతి చెందింది. భర్త వెంకటబాబ్జి, పెద్ద కూతురు లక్ష్మీసహస్రలకు గాయాలుకాగా చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. వెంకటబాబ్జి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. కారును కూడా అయనే నడిపాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

## భర్త దాడిలో భార్య మృతి



ఎల్లమ్మ (ఫైల్)

పెద్దకొత్తపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఉన్న భర్త చేసిన దాడిలో భార్య మృతి చెందిన ఘటన శుక్రవారం నాగర్‌కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంట్రావుపల్లి గ్రామానికి చెందిన ఎలక నాగేశ్ మద్యం మత్తులో గురువారం రాత్రి ఇంటికెళ్లి తన భార్య ఎలక ఎల్లమ్మ(41)తో గొడవపడ్డాడు. కర్రతో విచక్షణారహితంగా చితకబాదాడు. దీంతో అంతర్గతంగా బలమైన గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి అన్న ముంత శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వి.సతీష్ తెలిపారు.

## శాస్త్రీయ అవగాహన పెంపొందించాలి

- వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి విద్యావిభాగం, మే 30 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల స్థాయి నుండే విద్యార్థులలో శాస్త్రీయ అవగాహనను పెంపొంది స్తూ, శాస్త్రవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహించాలని వనపర్తి ఎస్పీ రా వుల గిరిధర్ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడి యం బాలికల ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల నుంచి వృత్యంత ర శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది.

అందులో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాస్త్రవేత్తల బాల్యం, విద్యాభ్యాసం, జీవన పోరాటం, నూతన ప్రయోగాల రూపకల్పన వైపు దారి తీసిన పరిణామాలను విద్యార్థులకు వివరించాలన్నారు. అనంతరం ఎస్పీని కోర్స్ డైరెక్టర్ మంజులత, జిల్లా సైన్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎంఈవో మహానంది ఘనంగా సన్మానించారు. కార్య క్రమంలో సెంటర్ ఇన్‌చార్జి మంజుల త, డీఆర్‌పీలు శ్రీనివాసులు, సుదర్శన్‌రావు, మల్లేశ్ కుమార్, సాయిచందర్ రెడ్డి పాల్గొన్నారు.

# శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద

- జలాశయంలోకి 19 వేల క్యూసెక్కులకు పైగా నీరు
- ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న ఉత్పత్తి

దోమలపెంట/ ఆత్మకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దులోని శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద వస్తోంది. శుక్రవారం సుంకేసుల నుంచి 4,345, జూరాల ప్రాజెక్టు గేట్ల ద్వారా 20,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. విద్యుత్ ఉత్పాదన కోసం 17,082 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తంగా 41,427 క్యూసెక్కుల నీరు శ్రీశైలం డ్యాం వైపునకు వస్తోంది. 19,288 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయంలోకి చేరుతోంది. గడిచిన 24 గంటల వ్యవధిలో ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో 3,617 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 1.579 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. ఎంజీకేఎల్ఐ కాలువ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని మళ్లిస్తున్నారు. దీంతో శుక్రవారం ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడగులకు గాను, 821.90 అడుగులకు చేరింది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలకు గాను, 42.2774 టీఎంసీల నీటి నిల్వ నమోదు అవుతున్నట్లు గేజింగ్ అధికారులు తెలిపారు. 4,571 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో కొనసాగుతోందని చెప్పారు.

### ప్రారంభమైన విద్యుత్ ఉత్పత్తి

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిధిలోని ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తిని శుక్రవారం ఉదయం ప్రారంభించినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద చేరుతోందని తెలిపారు. దీంతో ఎగువ జూరాల జల విద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా ఉత్పత్తి కొనసాగిస్తున్నట్లు చెప్పారు. దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో రెండు యూనిట్లను ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నామని తెలిపారు. జూన్ చివరి మాసంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించగా ఎగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 345 మిలియన్ యూనిట్లు, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 333 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. వరద ఇదే స్థాయిలో కొనసాగితే గత ఏడాది కంటే ఈ ఏడాది రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు.

# రెండు పంటలకు సమృద్ధిగా సాగు నీరు

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
- జూరాల కుడి కాలువకు నీటి విడుదల



జూరాల పంప్‌హౌస్ వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

ధరూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : గద్వాల నియోజకవర్గంలోని రైతులకు రెండు పంటలకు సాగు నీరు అందిస్తామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడి కాలువకు శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు చేసి నీరు విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ 18 సంవత్సరాల తర్వాత ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురవడం శుభ సూచకమన్నారు. ప్రతీ ఏడాది ఏరువాక పున్నమి సందర్భంగా నీరు విడుదల చేసే వారమని చెప్పారు. వరద నీటిని వృథా చేయకుండా కాలువల ద్వారా రిజర్వాయర్లు, చెరువులను నింపాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందని చెప్పారు. జూరాలకు వస్తున్న వరద నీటిని దృష్టిలో ఉంచుకుని నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా ర్యాలంపాడు, గూడెందొడ్డి పంపుల మోటార్లను ఇప్పటికే ఆన్ చేశామని, రిజర్వాయర్ల ద్వారా కాలువలకు సాగునీటిని విడుదల చేశామని వివరించారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాయల సంస్థ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ, పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచు శివారెడ్డి, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, ప్రభాకర్ గౌడ్, భగీరథ వంశీ, ఈశ్వర్, పవన్ రెడ్డి పాల్గొన్నారు.

## వేతన బకాయిలు విడుదల చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా

నాగర్‌కర్నూల్ టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలనరసింహ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముందు శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు ఏప్రిల్ నుంచి వేతనాలు రావడం లేదన్నారు. పని ప్రదేశంలో కనీస అవసరాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రోజుకు రూ. 600 ఇవ్వాలని, పని దినాలను 200 రోజులకు పెంచాలని డి మాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపా ధ్యక్షుడు బాలస్వామి, నాయకులు అద్యపాగ సుభాష్ సహాయ కార్యదర్శి నాగ రాజు, సీనియర్ మేటీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపేట భాస్కర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మధు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శివ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, ఉపాధ్యక్షుడు అశోక్, కూలీలు శాంతమ్మ, సాలమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కుర్చీలు వదలండి!

(3వ పేజీ తరువాయి)

ఇప్పటివరకు ఫాగింగ్ యంత్రాల మరమ్మతులు చేయకపోవడం, అసలే ఫాగింగ్ యంత్రాలు లేని గ్రామాలకు సరఫరా చేయకపోవడం సరికాదన్నారు. ఒక ప్రణాళిక చేసుకొని గతేడాది కేసులు ఎక్కువగా ఎక్కడ నమోదయ్యాయో అప్పటి ప్రణాళిక ఎందుకు పనిచేయలేదు, దానికి ప్రత్యామ్నాయ ప్రణాళికలు ఏంటీ అనే విషయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఏయే పీహెచ్‌సీ పరిధిలో డెంగీ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయో గుర్తించాలని చెప్పారు. జీజీహెచ్ రివ్యూ సందర్భంగా సాధారణ కాన్పుల కంటే సిజేరియన్లు ఎక్కువగా ఎందుకవుతున్నాయని, గర్భిణుల బంధువులు ముహూర్తం చూసుకొని కాన్పు చేసుకోవాలంటే వారిని ప్రోత్సహిస్తారా అని మండిపడ్డారు. ఎన్‌సీడీ కిట్లు అందడం లేదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకురాగా ఎందుకు పంపిణీ చేయడంలేదని మంత్రి అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి కావాల్సిన సహకారం అందుతున్నా ఆశా వర్కర్లు ఎన్‌సీడీ బాధితులకు మందులు పంపిణీ చేయకపోవడం సరికాదని అన్నారు. కలెక్టర్ ప్రతీవారం విద్య, వైద్యం, రెవెన్యూ విభాగాలపై సమీక్ష చేయాలని, కేవలం తాము వచ్చినప్పుడే హడావిడి చేయవద్దని సూచించారు. కోయిల్‌కొండ పీహెచ్‌సీ భవనం పెద్దది కట్టినా అక్కడ వైద్య సిబ్బంది లేరని, చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు కూడా మహబూబ్‌నగర్ జీజీహెచ్‌కు రావాల్సి వస్తోందని, వైద్య సిబ్బంది కేటాయింపులు చేయాలని నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మంత్రిని కోరారు.

### అంబులెన్స్ డ్రైవర్ల దందాపై ఎమ్మెల్యేల ఏకరువు

నారాయణ పేట జిల్లాతో పాటు మహబూబ్‌నగర్‌లోని వివిధ నియోజకవర్గాల నుంచి రోడ్డు ప్రమాద బాధితులను మహబూబ్‌నగర్‌కు పంపిస్తుంటే కొందరు వైద్యుల నుంచి అంబులెన్స్ డ్రైవర్ల వరకు కమీషన్లకు ఆశపడి వారిని బలవంతంగా హైదరాబాద్ అమీర్‌పేటలోని వెల్‌నెస్ ఆస్పత్రికి తరలిస్తూ దందా చేస్తున్నారని ఎమ్మెల్యేలు వైద్యారోగ్యశాఖ మంత్రి ముందు ఏకరువు పెట్టారు. ఒక యాక్సిడెంట్ కేసును మహబూబ్‌నగర్‌కు పంపిస్తే బాధితుడిని వెల్‌నెస్ ఆస్పత్రికి తరలించి రూ. 10 లక్షల బిల్లు చేశారని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆరోపించారు. రూ. 7 లక్షల చెల్లించిన తర్వాత మిగిలిన రూ. 3 లక్షలు ఇస్తేనే బాడీని ఇస్తామని ఆస్పత్రి నిర్వాహకులు చెప్పారని అన్నారు. కొందరు బాధితులు నిమ్స్‌కు తీసుకెళ్లాలని చెప్పినా అక్కడ బెడ్స్ లేవని, వెల్‌నెస్ ఆస్పత్రికి తరలించారని, తాను వెళ్లి నిమ్స్‌లో బెడ్ ఇప్పించానని నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి తెలిపారు. ఒక రోడ్డు ప్రమాద బాధితుడిని నిమ్స్‌లో బెడ్ ఇచ్చేవరకు ఆలస్యమవుతుందని చెప్పి నేరుగా వెల్‌నెస్ ఆస్పత్రికి తరలించి రూ. 7 లక్షల బిల్లు చేశారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా వెల్‌నెస్ ఆస్పత్రి బాగోతాన్ని బయటపెట్టారు. తన నియోజకవర్గంలోని ఓ పేషెంట్‌కు రూ. 3.5 లక్షల బిల్లు వేస్తే తానే స్వయంగా వెళ్లి బిల్లు తీసుకొని ఆ పరీక్షలు, వైద్యానికి ఎంత అవుతుందని నిమ్స్‌లో చెక్ చేస్తే రూ. 25 వేలు అవుతుందని నిర్ధారించారన్నారు. కోఠిలోని డైరెక్టర్‌తో మాట్లాడితే ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పేషెంట్‌ను పంపించారని వివరించారు. మహబూబ్‌నగర్ జీజీహెచ్ కేంద్రంగానే ఈ దందా నడుస్తోందని, కలెక్టర్ సీరియస్‌గా దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు.

క్రైం కార్నర్

## చిరుత పులి దాడి

» రెండు లేగ దూడలు మృతి

నవాబ్‌పేట, మే 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలో మరోసారి చిరుతపులి అలజడి సృష్టించింది. ఇటీవల మండలంలోని యన్మనగండ్ల గ్రామానికి చెందిన రైతులు ఎర్ర కిష్టయ్య, కోస్గి శ్రీనివాస్‌లకు చెందిన లేగదూడలతో పాటు ఊరకుక్కలపై చిరుతలు దాడి చేసి చంపేశాయి. అప్పుడు గ్రామస్థుల విన్నపం మేరకు అటవీశాఖ అధికారులు చిరుతలను పట్టుకునేందుకు గ్రామ సమీపంలోని దేవరగుట్టపై బోన్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయినా అవి పట్టుబడలేదు. ఎక్కడికో వెళ్లిపోయి ఉంటాయి అనుకుంటున్న సమయంలో అవి మళ్లీ దాడి చేశాయి. శుక్రవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన వేణుగోపాల్ గురువారం సాయంత్రం పొలంలో పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. తెల్లవారుజామున పొలానికి వెళ్లి చూడగా రెండు లేగదూడలు మృతి చెంది ఉన్నాయి. ఈ విషయంపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సెక్షన్ అధికారి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. చిరుత దాడిలోనే లేగదూడలు మృతి చెందాయని తెలిపారు. జాగ్రత్తగా ఉండాలని గ్రామస్థులకు సూచించారు.

## విద్యుదాఘాతంతో పశువుల మృతి


మృతి చెందిన గేదెకు పంచనామా నిర్వహిస్తున్న పశువైద్య అధికారి షేక్ మదార్

చారకొండ/ కోస్గి/ మరికల్, మే 30 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ, నారాయణపేట జిల్లా కోస్గి, మరికల్ మండలాల్లో శుక్రవారం ఐదు పశువులు విద్యుదాఘాతంతో చనిపోయాయి. చారకొండ మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు గోలి జోగిరెడ్డి అదే గ్రామానికి చెందిన శుక్రవారం ఓ రైతు పొలంలో మేపేందుకు గేదెను తీసుకెళ్లాడు. అది ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తూ పక్కనే ఉన్న ఎర్త్ వైర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. దాని విలువ రూ. 30 వేలు ఉంటుందని రైతు తెలిపాడు.

● నారాయణపేట జిల్లా, కోస్గి మండలంలోని తొగాపూర్ గ్రామానికి చెందిన రైతు వెంకటయ్య ఆవును మేతకు తీసుకెళ్లాడు. అది గ్రామ సమీపంలోని పొలంలో మేత మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆవు విలువ లక్ష రూపాయలు ఉంటుందని రైతు తెలిపాడు.

● మరికల్ మండల కేంద్రానికి చెందిన మంతన్‌గోడు భాస్కర్‌రెడ్డి తన పొలంలో గేదెలు మేస్తుండగా విద్యుత్ తీగలు తెగి పడడంతో 3 గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వాటిలో ఒక చూడి గేదె ఉంది. చనిపోయిన గేదెల విలువ రూ. 2 లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

## కుక్కల దాడిలో గొర్రెలు మృతి


చిన్నతాండ్రపాడులో కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలు, మేకలు

అయిజ, మే 30 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండల పరిధిలోని చిన్నతాండ్రపాడు గ్రామంలో ఊర కుక్కల దాడిలో 17 గొర్రెలు చనిపోయాయి. గ్రామానికి చెందిన రైతులు కిష్టన్న, రాము, రంగన్నలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వారు గ్రామ సమీపంలోని పొలంలో కంచె ఏర్పాటు చేసి గొర్రెలను ఉంచి రాత్రి వేళ ఇంటికి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా 17 గొర్రెలు, మేకలు చనిపోయి ఉన్నాయి. మరికొన్ని గాయపడ్డాయి. అక్కడికి సమీపంలో ఊర కుక్కలు ఉండటంతో అవే దాడి చేసినట్లు తెలుసుకున్నారు. చనిపోయిన జీవాల విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

## రైతు వేదికలో దొంగతనం

» వీసీ యూనిట్, కంప్యూటర్ చోరీ


ఖిల్లాఘణపురం రైతు వేదికలో చోరీకి సంబంధించి ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

ఖిల్లాఘణపురం, మే 30 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని రైతు వేదికలో చోరీ జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌తో పాటు కంప్యూటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. సంఘటనకు సంబంధించి క్లస్టర్ ఇన్‌చార్జి ఏఈవో సునీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 10న రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ పరికరాలను ఏర్పాటు చేశారు. 28న రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ట్రయల్ రన్ క్లస్టర్ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. రైతు వేదిక వాచ్‌మెన్ శుక్రవారం కార్యాలయాన్ని తెరిచి చూసే సరికి వీసీ యూనిట్‌లోని సీపీయూ, మానిటర్, కీబోర్డు తదితర రూ. 40 వేల విలువైన పరికరాలు మాయం అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీస్ శాఖ క్లూస్ టీం సభ్యులు శుక్రవారం రైతు వేదికను క్షుణ్ణంగా పరిశీలించి, ఆధారాలు సేకరించారు. ఇన్‌చార్జి ఏఈవో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేశ్ గౌడ్ తెలిపారు.

## వేటాడితే కఠిన చర్యలు

» అటవీశాఖ అధికారి ఈశ్వర్


ఉడుములను వేటాడి తీసుకెళ్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఫారెస్టు అధికారులు

అచ్చంపేట టౌన్ (లింగాల) మే 30 (ఆంధ్రజ్యోతి) : అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ అధికారి ఈశ్వర్ హెచ్చరించారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, లింగాల మండల పరిధిలోని పద్మనపల్లి గ్రామానికి చెందిన కాట్రాజు రాజు, కాట్రాజు నిరంజన్, రాయ బాలయ్య, బల్మూరి లింగస్వామి శుక్రవారం అటవీ ప్రాంతంలో ఉడుములను వేటాడి పట్టుకున్నారు. వాటిని తీసుకొస్తుండగా అధికారులు గమనించి అదుపులోకి తీసుకున్నారు. వారు పట్టుకున్న వాటిలో 3 ఉడుములు చనిపోగా 6 బతికి ఉన్నట్లు గుర్తించి, వాటిని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. నిందితులు నలుగురిపై కేసు నమోదు చేశారు.

# కరిగిపోతున్న ఊరగుట్ట

» ఇష్టానుసారంగా బ్లాస్టింగ్ చేసి రాళ్ల తరలింపు
» 200 ఎకరాలలో విస్తరించి ఉన్న గుట్ట
» అనుమతులు లేకుండానే బ్లాస్టింగ్


బ్లాస్టింగ్‌లతో గుట్టపై ఏర్పడిన గుంతలు


రాళ్లను తరలిస్తున్న ట్రాక్టర్

అచ్చంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీకి రావాల్సిన ఆదాయం అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతుంది. నియంత్రించాల్సిన అధికారులు మౌనంగా ఉండడంతో ఇష్టానుసారంగా గుట్టను కరిగిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని పెనిమిల్ల గ్రామ సమీపంలో ప్రభుత్వ భూమిలో 200 ఎకరాలలో ఊర గుట్ట విస్తరించి ఉంది. ఈ గుట్ట నుంచి గ్రానైట్ రాయితో పాటు, కంకర నిత్యం గ్రామం గుండా అచ్చంపేట తదితర పట్టణాలకు తరలిస్తున్నారు. కానీ పంచాయతీకి పైసా ఆదాయం రావడం లేదు. రెవెన్యూ, మైనింగ్ శాఖతో పాటు పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో ట్రాక్టర్లు గ్రామానికి వచ్చిపోతున్నాయి. కాగా ఇష్టానుసారంగా బ్లాస్టింగ్ చేసి గుట్టను ధ్వంసం చేస్తున్నా ఆపేక్షించేవారే లేరు.

### రోజుకు రూ.లక్షల్లో ఆదాయం

ఒక ట్రాక్టర్ ట్రిప్పు రాయికి రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ధర పలుకుతుంది. ఒక్కో కడి రాయికి రూ.280 తీసుకొంటున్నారు. కంకర ఒక ట్రిప్‌కి రూ.3వేలు చొప్పున అమ్ముతూ దాదాపు రూ.లక్ష వరకు వ్యాపారం సాగుతుంది.

### వనరులను కాపాడుకోవాలి



పంచాయతీ పరిధిలో ఉన్న ఏ ప్రభుత్వ భూమి అయినా పంచాయతీకే చెందాలి. ఊర గుట్టను బయటి వ్యక్తులు వచ్చి కొల్లగొడుతున్నారు. ఉన్న వనరులు పోగొట్టుకున్నాక గ్రామానికి మిగిలేదేమీ ఉండదు. గ్రామానికి చెందిన వ్యక్తులు మాత్రమే బండను ఉపయోగించుకోవాలి. బయటివారు రాకుండా చర్యలు తీసుకోవాలి. ప్రతీ రోజు గ్రామంలో ట్రాక్టర్లు ఇష్టానుసారంగా వచ్చిపోతున్నాయి దీంతో రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయి.

- జక్క చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్

### మా పరిధిలోకి రాదు

గ్రామ సమీపంలో ఉన్న ఊరగుట్ట పంచాయతీ పరిధిలోకి రాదు. రెవెన్యూ శాఖ పరిధిలోకి వస్తుంది. పంచాయతీ తీర్మానం మేరకు గ్రామం గుండా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుంటాం.

- భాస్కర్ పెనిమిళ్ల, పంచాయతీ కార్యదర్శి

# డిజిటలైజేషన్‌పై అవగాహన పెంచుకోవాలి

» హైదాబాద్‌లో పాత్రికేయులకు కంప్యూటర్ శిక్షణ
» మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, పక్కనే కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్

మన్ననూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : నేటి వార్తా ప్రపంచం డిజిటలైజేషన్ వైపు వేగంగా అడుగులు వేస్తోందని, అందుకు అనుగుణంగా పాత్రికేయులు అవగాహన పెంపొందించుకోవాలని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో నాగర్‌కర్నూలు జిల్లా, అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు పర్యాటక వనమాలిక ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన పాత్రికేయుల శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సిఫారసులను అమలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అధికార యంత్రాంగం చేపట్టే అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని మీడియా ప్రతినిధులను కోరారు. ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ మాట్లాడుతూ నిజమైన జర్నలిస్టులకు గుర్తింపు ఇచ్చేందుకు పోలీస్ శాఖ ద్వారా ఐడీ కార్డులను అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన పాత్రికేయులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, సంపాదకుడు ఉడుముల సుధాకర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు భావ నారాయణ, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, స్థానిక విలేకరులు రాములు, సాయిబాబా, శ్రీధర్, లక్ష్మీపతి, కొండయ్య, ప్రకాశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

# వచ్చే నెల 4 నుంచి బ్రహ్మోత్సవాలు

» శ్రీపురం క్షేత్రంలో కొనసాగుతున్న ఏర్పాట్లు
» కరపత్రాలను ఆవిష్కరించిన ఆలయ కమిటీ సభ్యులు


బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు

కందనూలు, మే 30 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, మండల పరిధిలోని శ్రీపురం క్షేత్రంలోని శ్రీరంగనాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వచ్చేనెల 4 నుంచి ప్రారంభం కానున్నాయి. 7వ తేదీ వరకు కొనసాగనున్న ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మకర్త రంగాచార్యులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో భాగంగా 4న అభిషేకం, తిరుమంజనం, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ నిర్వహించనున్నట్లు తెలిపారు. 5న అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, భేరీ పూజ, దేవతాహ్వానం ఉంటాయని చెప్పారు. 6న ఉదయం గోదా రంగనాయకస్వామి కల్యాణం, సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

7న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, దేవతోద్వాసన, ద్వాదశారాధన, ధ్వజావ రోహణం, కుంభప్రోక్షణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనునట్లు తెలిపారు. ఉత్సవాలకు వేలాదిగా తరలి వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, వినోదాచార్యులు, గంధం ప్రసాద్, చంద్రనారాయణ, వరదయ్య, దురెడ్డి రవీందర్‌రెడ్డి, మారం మాధవ్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, మల్లికార్జున్, టీవీ రవి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అవసరాలపై అవగాహన ఉండాలి

» యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ ఖ్యాతి
» ఆలూరులో వేసవి శిబిరాల పరిశీలన



ఐకేపీ అధ్వర్యంలో ఆలూరులో నిర్వహించిన స్నేహ సంఘాల సమావేశానికి హాజరైన యూనిసెఫ్ ప్రతినిధులు

గట్టు, మే 30 (ఆంధ్రజ్యోతి) : కిశోర బాలికలకు ఆర్థిక అవసరాలపై అవగహన ఉండాలని యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ ఖ్యాతి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండల పరిధిలోని ఆలూరు గ్రామంలో స్నేహ సంఘాల అధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలను యూనిసెఫ్ బృందం శుక్రవారం పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన స్నేహ సంఘాల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంత డబ్బు వస్తుందో, ఎంత ఖర్చు పెట్టాలో తెలుసుకోవాలన్నారు. డబ్బు సంపాదించాలంటే నైపుణాలను కలిగి ఉండాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. పిల్లలు, తల్లులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకొని, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధులు డాక్టర్ నరసింహారావు, ప్రముఖ్, డీపీఎం ఎల్లప్ప, ఇన్‌చార్జి ఎంపీఎం జయకర్, సీసీలు ఆంజనేయులు, జ్యోతి, రామకృష్ణ పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణతోనే మానవాళికి మనుగడ

» అంబాత్రయ క్షేత్ర పీఠాధిపతి స్వామి ఆదిపరాశ్రీ


బిజ్వార్ క్షేతంలో కృష్ణస్వామితో కలిసి మొక్కలు నాటుతున్న స్వామి ఆదిపరాశ్రీ

ఊట్కూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యం అవుతుందని బిజ్వార్ అంబాత్రయ క్షేత్ర పీఠాధిపతి స్వామి ఆదిపరాశ్రీ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ఊట్కూరు మండలంలోని అంబాత్రయ క్షేత్రం ఆవరణలో శుక్రవారం ప్రకృతి ప్రేమికుడు, కృష్ణసాగర్‌తో కలిసి మహాబిల్వపత్రి, ఉసిరి, నేరేడు, రావి తదితర మొక్కలను నాటారు. ఈ సందర్భంగా స్వామి ఆదిపరాశ్రీ మాట్లాడుతూ పర్యావరణం దెబ్బతింటే భవిష్యత్తులో జీవుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. అందుకోసం అందరూ మొక్కలను నాటి సంరక్షించుకోవాలని కోరారు. కృష్ణసాగర్ పర్యావరణ పరిరక్షణకు 12 సంవత్సరాల నుంచి కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు మాజీ కౌన్సిలర్ నందిమల్ల భువనేశ్వరి, నందిమల్ల శ్యాం, అశ్విని మణిదీప్, రాఘవేందర్ పాల్గొన్నారు.

## చోరీ కేసులో మూడేళ్ల జైలు శిక్ష


నేరస్థుడు బొల్లి కురుమూర్తి

ఆత్మకూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో నేరం రుజువైనందున ఓ వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.200 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణ పరిధిలో ఫిబ్రవరి 23న పరమాల మణివర్ధన్ రెడ్డి ఇంట్లోకి బొల్లి కురుమూర్తి అనే వ్యక్తి చొరబడ్డాడు. పూజ గదిలో ఉన్న హుండీని పగులగొట్టి రూ.1500 ఎత్తుకెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ బాలేశ్వర్ రెడ్డి విచారణ చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి, చార్జిషీటు దాఖలు చేశారు. శుక్రవారం వనపర్తి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల పాటు జైలు శిక్ష, రూ. 200 జరిమానా విధిస్తూ న్యాయాధికారి శ్రీలత తీర్పు వెల్లడించినట్లు డీఎస్పీ తెలిపారు.

## నాగ్ అశ్విన్‌ను అభినందించిన భరత్‌ప్రసాద్


ఉత్తమ దర్శకునిగా ఎంపికైన నాగ్ అశ్విన్, తల్లిదండ్రులు జయంతి, జయరాంరెడ్డిలతో బీజేపీ నాయకుడు భరత్ ప్రసాద్

తాడూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గద్దర్ పురస్కారాలు - 2024లో ఉత్తమ దర్శకుడిగా ఎంపికైన నాగ్ అశ్విన్‌ను బీజేపీ నాయకుడు పోతుగంటి భరత్‌ప్రసాద్ అభినందించారు. హైదరాబాద్‌లోని నివాసంలో శుక్రవారం ఆయన నాగ్ అశ్విన్‌ను కలిసి మాట్లాడారు. ఉత్తమ దర్శకుడిగా ఎంపిక కావడంపై హర్షం ప్రకటించారు. అలాగే నాగ్ అశ్విన్ తల్లి, ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ జయంతి, తండ్రి, ప్రముఖ కిడ్నీ స్పెషలిస్టు డాక్టర్ జయరాంరెడ్డిలను కలిసి సంతోషం వ్యక్తం చేశారు.

## అండర్-23 క్రికెట్ 2డే లీగ్‌లో జడ్చర్ల జట్టు ముందంజ


జడ్చర్లలోని మినీస్టేడియంలో జరుగుతున్న అండర్-23 క్రికెట్ 2డే లీగ్‌మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తున్న జడ్చర్ల జట్టు క్రీడాకారుడు

జడ్చర్ల, మే 30(ఆంధ్రజ్యోతి) : అండర్-23 క్రికెట్ 2డే లీగ్‌లో జడ్చర్ల జట్టు ముందంజలో ఉంది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మినీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన మ్యాచ్‌లో జడ్చర్ల, వనపర్తి జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన జడ్చర్ల జట్టు 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 310 పరుగులు సాధించింది. ఇందులో కేతన్‌కుమార్ 113 పరుగులు సాధించాడు. హర్షిత్ 93 పరుగులు, సంజ్ 65 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన వనపర్తి జట్టు 43 ఓవర్లలలో 184 పరుగులు చేసి ఆలౌట్ అయ్యారు. ఫర్హద్ 52 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోర్ అందించేందుకు కృషి చేశాడు. జడ్చర్ల జట్టులోని హర్షిత్, పవన్‌సాయిలు చెరో మూడు వికెట్లు తీశారు. శనివారం రెండవ ఇన్నింగ్స్ ఆడనున్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆలేరు విద్యార్థులు


ఉపాధ్యాయులతో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తెలకపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆలేరు జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు అండర్-12 విభాగంలో వి.మహాలక్ష్మి 6వ తరగతి (600మీటర్ల పరుగు పందెం), జి.మమత 6వ తరగతి (300 మీటర్ల పరుగు పందెం) రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు జీహెచ్‌ఎం నరహరి, పీడీ బాలయ్య శుక్రవారం తెలిపారు. విద్యార్థులను అభినందించారు. ఈ విద్యార్థులు జూన్ 1న హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ టీచర్లు బుచ్చన్న, సత్యనారాయణ, చంద్రశేఖర్, చైర్‌పర్సన్ అమృతమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

## విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

● రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారి, కోస్గి



కోస్గి రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలని కోస్గి మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

**నకిలీ విత్తనాలపై తనిఖీలు నిర్వహించారా?**

కోస్గి మండల కేంద్రంతో పాటు, పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం.

**మండలంలో ఎక్కడైనా నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయా?**

ఇంతవరకు ఎక్కడా పట్టుబడలేదు.

**వ్యవసాయ శాఖ తరఫున సబ్సిడీపై విత్తనాలు అందుబాటులో ఉన్నాయా?**

ప్రస్తుతానికి జీలుగ విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నాం.

**ఆగ్రోస్ కేంద్రాల్లో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయా?**

ఎరువులతో పాటు, విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయి.

**ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంటలు ఏవి?, వాటి సాగు విస్తీర్ణం ఎంత ఉండవచ్చు?**

వరి, కందులు, పత్తి ప్రధాన పంటలతో పాటు, జొన్న కూడా సాగవుతుంది. దాదాపు 21,500 ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంటుంది.

### పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం ధాన్యం విక్రయానికి వచ్చింది. ధాన్యం ధరలు ఈ విధంగా ఉన్నాయి.

| ధాన్యం | క్వింటాల్ | గరిష్ట | కనిష్ట (రూపాయలలో) |
|---|---|---|---|
| వడ్లు సోనా | 128.40 | 2,066 | 1,739 |
| వడ్లు హంస | 13.80 | 1,670 | 1,640 |
| తెల్ల కందులు | 1.47 | 7,000 | 7,000 |
| ఎర్ర కందులు | 40.02 | 6,819 | 6,150 |

న్యూస్ బాక్స్

### నర్సరీ, ప్లాంటేషన్ పరిశీలన

మాగనూరు మే 30 (ఆంధ్రజ్యోతి): మాగనూరు మండలం వడ్వాటు గ్రామ పంచాయతీ పరిధిలోని నర్సరీ, మునగ ప్లాంటేషన్‌ను శుక్రవారం ఎంపీడీవో రహమతుద్దీన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం వనమహోత్సవంలో మొక్కలు నాటడానికి అనుకూలమైన స్థలాలు చూడాలని పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లను కోరారు. నర్సరీలో కలుపు మొక్కలు వేరు వేయాలని, ప్లాంటేషన్‌లో మొక్కల ఎదుగుదల కోసం ఎరువులు తదితర వాటిని వాడాలని సూచించారు.

### నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



దామరగిద్దలోని ఓ ఫర్టిలైజర్ షాపులో విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు

దామరగిద్ద, మే 30 (ఆంధ్రజ్యోతి): నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, పురుగుల మందులు అమ్మి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి మణిచందర్, ఎస్ఐ రాజు హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీడ్స్ ఫర్టిలైజర్స్ షాపులను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల లైసెన్సులను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులు విత్తనాలు తీసుకున్నప్పుడు రశీదులు అడిగి తీసుకోవాలని తెలిపారు. ఏఎస్ఐ అరుణ్‌కుమార్ ఉన్నారు.

### దేవాలయం అభివృద్ధికి ఆర్థిక సహాయం

మరికల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ధన్వాడ మండలం గున్ముక్ల గ్రామంలో వెలసిన స్వయంభు కడపరాయస్వామి దేవాలయం అభివృద్ధికి మరికల్ పట్టణానికి చెందిన అడ్వకేట్ అయ్యప్ప శుక్రవారం ఆలయ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి రూ.25 వేలు అందజేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి తన వంతు సహాయం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పూజారి నాగార్జున, నరసింహారెడ్డి, శివకుమార్, కృష్ణగౌడ్, భీమ్‌శంకర్, అశోక్ గౌడ్, బసన్న, తిప్పయ్య తదితరులున్నారు.

### శివాజీ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడి మృతి

నారాయణపేట న్యూటౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): శివాజీ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు మాంద్రె నర్సింహులు(89) అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు. శుక్రవారం ఆయన అంత్యక్రియలు నారాయణపేటలో నిర్వహించారు. వ్యాపార సంస్థలు, రాజకీయ ప్రముఖులు, పూర్వ విద్యార్థులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో శివాజీ విగ్రహ ఏర్పాటుకు నర్సింహులు ఎనలేని కృషి చేశారని పలువురు గుర్తు చేశారు.

# అన్నదాతల్లో హుషారు

» రోహిణీలోనే ముందస్తు సాగుకు శ్రీకారం

» పత్తి విత్తనాలు విత్తుతూ, వరి వెదజల్లుతూ బిజీబిజీ



మక్తల్ మండలం పారేవుల గ్రామంలో కరిగెటలో వరి విత్తనాలను వెదజల్లుతున్న రైతు



నర్వలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

నారాయణపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదు రోజులుగా విస్తారంగా వర్షాలు కురియడంతో జిల్లా రైతాంగంలో హుషారు రెట్టింపు అయింది. దీంతో వానాకాలం ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టారు. ముందస్తు వర్షాలు కురియడంతో రైతాంగం పంట పొలాలను దుక్కి దున్ని సిద్ధం చేసుకున్న వారు రోహిణీ కార్తెలోనే పత్తి విత్తనాలు విత్తడంలో ఆసక్తి కనబర్చుతున్నారు. మరోపక్క కృష్ణానది జలాలు పారుతుండడంతో నదీ పరివాహక ప్రాంతాల్లో రైతులు వరి నారు పెంచుకునేందుకు కరిగెట్లు చేస్తూ విత్తనాలు వెదజల్లుతున్నారు. జిల్లావ్యాప్తంగా వానాకాలం ఖరీఫ్ సాగు 4.35 లక్షల ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి జాన్ సుధాకర్ అంచనా వేశారు. జిల్లాలో అత్యధికంగా పత్తి పంట లక్షా 80 వేల ఎకరాల్లో సాగు కానుంది. ఇప్పటికే రైతులు డీలర్ల నుంచి విత్తనాలు కొనుగోలు చేశారు. నర్వ, ఊట్కూర్, నారాయణపేట, దామరగిద్ద మండలాల్లో పత్తి విత్తనాలు విత్తుతున్నారు. ఇక వరి లక్షా 75 వేల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేశారు. 30 వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉండగా, డీలర్ల వద్ద 3,958 క్వింటాళ్ల వరి విత్తన నిల్వలు ఉన్నాయి.

## డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

» ఎంవీఐ శివశంకర్



మాట్లాడుతున్న ఎంవీఐ శివశంకర్

నారాయణపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని పోలీస్ వాహన డ్రైవర్లు డ్రైవింగ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, వాహనాలను కండీషన్‌లలో ఉంచుకోవాలని మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) శివశంకర్ అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లకు జరిగిన శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో పెట్రోల్ కార్, ఎస్‌హెచ్‌వోల వద్ద విధులు నిర్వహించే వాహన డ్రైవర్లు నిరంతరం రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండాలన్నారు. పెట్రోలింగ్ సమయంలో నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. ముందస్తు నేరాలు జరుగకుండా సైరన్ వేసుకుంటూ పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. వాహనాలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలన్నారు. డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాల మెకానిజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

## ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించాలి



ఉపాధి కూలీల ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్

నారాయణపేట టౌన్, మే 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం రూ2 లక్షల కోట్లు విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అంజిలయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఆయా సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ పార్కు వద్ద రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నిర్వహిస్తున్న తీరును నిరసిస్తూ కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద జపం చేస్తూ దేశ ప్రజానీకాన్ని పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఉపాధి కూలీలు పని ప్రదేశంలో ప్రమాదానికి గురైతే ఉచిత వైద్యం, మరణిస్తే రూ.10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని లేకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలప్ప, సాయిబాబా, ఎల్లప్ప, రేణమ్మ, కిష్టప్ప, గోవింద్, హనుమంతు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పవన్, మహేష్‌లతో పాటు కూలీలు పాల్గొన్నారు.

## టీజేఎఫ్ రజతోత్సవ సంబురాలకు తరలిరావాలి



విలేకరుల సమావేశంలో టీజేఎఫ్ రాష్ట్ర నాయకులు

నారాయణపేట న్యూటౌన్, మే 30 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన టీజేఎఫ్ 25 వసంతాల సంబురాలు జరుపుకోవడం గర్వంగా ఉందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ హెచ్-143 జాతీయ కార్యవర్గ సభ్యుడు వారధి నవీన్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కలాల్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్రను తెలియజేస్తూ రెండు దఫాల్లో గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమాలు చేసిన ఏకైక జర్నలిస్టు యూనియన్ టీజేఎఫ్ అని పేర్కొన్నారు. తెలంగాణ అవతరణ అనంతరం టీయూడబ్ల్యూజే (హెచ్-143)గా ఏర్పాటు అయ్యిందన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన టీజేఎఫ్ 25వ వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఈనెల 31న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో నిర్వహించ తలపెట్టిన రజతోత్సవ వేడుకలను జిల్లా నుంచి అధిక సంఖ్యలో జర్నలిస్టులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడిగె అనంతరామ్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, యూనియన్ సభ్యులు శ్రీధర్, రహీం, శ్రీనివాస్, అంబదాస్, రాము, వినోద్ శ్రీనివాసులు పాల్గొన్నారు.


### వాల్‌పోస్టర్ విడుదల

మాగనూరు : ఈనెల 31న హైదరాబాద్‌లోని జలవిహార్‌లో జరగనున్న తెలంగాణ జర్నలిస్టు ఫోరం 25వ వసంతాల సంబురాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శుక్రవారం మాగనూరులో తహసీల్దార్ సురేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆర్ఐ శ్రీశైలం, జర్నలిస్టులు రాము, చంద్రశేఖర్‌గౌడ్, శివకుమార్, వర్కూరు రాజు, శ్రీనివాసులు ఉన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ

దామరగిద్ద, మే 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దరి చేరవని ర్యాపిడ్ రెస్పాన్స్ టీం పర్యవేక్షకుడు ఆర్.శంకర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకుడు వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా దామరగిద్ద మండల కేంద్రంలో ప్రతీ ఇంటి పరిసరాలను వారు పరిశీలించారు. ఇళ్లల్లో ఉన్న డ్రమ్ములు, సిమెంట్ తొట్లల్లో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకొని దోమలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దోమకాటు వల్ల డెంగీ, మలేరియా వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ పర్యవేక్షకులు వెంకటేష్, చంద్రశేఖర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగిసిన వేసవి క్రీడా శిబిరం




ప్రశంసాపత్రాలు అందిస్తున్న జిల్లా సైక్లింగ్ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత పీఈటీ గోపాలం

మక్తల్, మే 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత పీఈటీ గోపాలం ఆధ్వర్యంలో మే 1 నుంచి 30 వరకు సాయిజ్యోతి ఉన్నత పాఠశాల మైదానంలో ప్రారంభమైన ఉచిత వేసవి క్రీడా శిబిరం శుక్రవారం ముగిసింది. గోపాలం తన స్వంత ఖర్చులతో 70 మంది బాలబాలికలకు సైక్లింగ్, ఖోఖో క్రీడల్లో మెరుగైన శిక్షణ అందించారు. శుక్రవారం విద్యార్థులకు క్రీడా దుస్తులు, సామగ్రి, ప్రశంసాపత్రాలు అందించారు. పీఈటీలు రమేష్, రాఘవేందర్ సహకారం అందించారు.

### జిల్లాలో కురిసిన వర్షం

నారాయణపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. అత్యధికంగా కృష్ణ మండలంలో 22.0 మి.మీ., అత్యల్పంగా మక్తల్ మండలంలో 1.0 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. దామరగిద్ద మండలంలో 11.8 మి.మీ., నారాయణపేట మండలంలో 3.8 మి.మీ., కొత్తపల్లి మండలంలో 3.1 మి.మీ., మద్దూర్ మండలంలో 2.0 మి.మీ., మాగనూర్ మండలంలో 1.3 మి.మీ. వర్షపాతం నమోదైంది.

### స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

మరికల్, మే 30 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కే.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తీలేరు గ్రామంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీకి సేవ చేసిన వారికి పదవుల్లో తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. త్వరలోనే స్థానిక ఎన్నికలు జరగనున్నాయని, కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో వెంకట్‌రెడ్డి, తిమ్మారెడ్డి, కుర్మన్న, రాంచంద్రయ్య తదితరులున్నారు.

### ఎర్రకుంట అలుగు పరిశీలన

కోస్గి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎర్రకుంట అలుగును ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. శుక్రవారం ఏఈలు నిర్మల, పవన్ రెడ్డి, రామకృష్ణ, డీఈ ఆనంద్‌కిశోర్ అలుగును పరిశీలించారు. అలుగుపై భవనాలు కట్టి అద్దెకు ఇచ్చారని ఫిర్యాదు అందడంతో వారు తనిఖీలు చేశారు. కుంట అలుగును మూసి దుకాణాలు నిర్మిస్తే మునిసిపల్ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని ఇరిగేషన్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై కలెక్టర్‌కు నివేదిక పంపుతామని వారు పేర్కొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించాలి

మద్దూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించాలని ఎంపీడీవో నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లెగడ్డలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి హౌసింగ్ అధికారులతో కలిసి ఆయన మార్కింగ్ ఇచ్చారు. హౌసింగ్ డీఈ హరికృష్ణ, ఎంపీవో నాగప్ప, గ్రామ కార్యదర్శి శైలజ, మాజీ సర్పంచ్ సీతాబాయి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు అనిల్ నాయక్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### బ్యాంకు ఖాతా ద్వారా వేతనాలు అందించాలి

మక్తల్, మే 30 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతా ద్వారా తమకు వేతనాలు అందించాలని కోరుతూ శుక్రవారం మునిసిపల్ కార్మికులు పుర కమిషనర్ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ-కుబేర్ ద్వారా అందిస్తున్న వేతనాలు నాలుగు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం స్పందించి తమ వేతనాలను బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు. కార్మికులు తిరుపతి, ఆనంద్, శంశోద్దీన్ తదితరులున్నారు.

### టీయూసీఐ ప్రథమ మహాసభలు విజయవంతం చేయాలి

దామరగిద్ద, మే 30 (ఆంధ్రజ్యోతి): జూన్ 15, 16 తేదీల్లో నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగే టీయూసీఐ జిల్లా ప్రథమ మహాసభలు విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరసింహ పిలుపునిచ్చారు. శుక్రవారం దామరగిద్ద మండలంలోని కానుకుర్తి, ఇట్లాపూర్ గ్రామాల్లో ఆయన కరపత్రాలను పంచి, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రామకృష్ణ, రైతు సంఘం జిల్లా నాయకుడు తాయప్ప, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

### వ్యవసాయ కార్మికులందరికీ ఆత్మీయ భరోసా అమలు చేయాలి

ఊట్కూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వ్యవసాయ కార్మికులందరికీ వెంటనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు మల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం నాయకులతో కలిసి మండలంలోని బిజ్వార్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి సభ్యత్వం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నాయకులు వెంకట్‌రెడ్డి, అంజనేయులు, రాము, కూలీలు, రైతులు ఉన్నారు.

## అన్నివర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

» కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి



మద్దూర్‌లో కాడా అధికారితో కలిసి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కునందిస్తున్న తిరుపతిరెడ్డి

కోస్గి/మద్దూర్/కొత్తపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏ.తిరుపతిరెడ్డి అన్నారు. కోస్గి మండలంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అంతకు ముందు గుండుమాల్ మండలంలోని రైతువేదిక కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అదే విధంగా, మద్దూర్ రైతువేదికలో కాడా అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వీటితో పాటు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారన్నారు. అనంతరం కొత్తపల్లి మండలంలో కూడా చెక్కులు పంపిణీ చేశారు. కాడా అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్‌కుమార్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు రఘువర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, మద్దూర్, కొత్తపల్లి తహసీల్దార్లు మహేశ్‌గౌడ్, జయరాములు, మద్దూర్ మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింహా, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భీములు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రఘుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ సంజీవ్, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

## కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులు వేగంగా చేయాలి

కోస్గి రూరల్/మద్దూరు/కొత్తపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): గుండుమాల్‌లో నిర్మిస్తున్న నూతన మండల కాంప్లెక్స్ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. శుక్రవారం ఆయన కాడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి కోస్గి మండలంలో పర్యటించారు. కోస్గి ప్రభుత్వ ఆసుపత్రి పక్కన నిర్మిస్తున్న మండల కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. బండరాళ్లు తొలగించడంలో నిర్మాణ పనులు ఆలస్యం అయ్యాయని, ఇప్పుడు సజావుగా జరుగుతున్నాయని కాంట్రాక్టర్లు తెలిపారు.

అదేవిధంగా, కొత్తపల్లిలో నిర్మాణంలో ఉన్న సమీకృత కార్యాలయాల భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. పనులు పిల్లర్ల స్థాయిలో ఉండడంపై కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక కొరత ఉండటం వల్ల పనులు ముందుకు సాగడం లేదని కాంట్రాక్టర్లు తెలుపగా, కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

## భూసేకరణకు రైతులు సహకరించాలి : ఆర్డీవో

» కొడంగల్ తరహాలో నష్ట పరిహారం ఇవ్వాలని రైతుల డిమాండ్



పెద్దపొర్లలో జరిగిన గ్రామ సభలో పాల్గొన్న ఆర్డీవో, తహసీల్దార్

ఊట్కూర్, మే 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద కాల్వల కోసం జరుగుతున్న భూసేకరణకు రైతులందరు సహకరించాలని నారాయణపేట ఆర్డీవో రాంచందర్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దపొర్లలో గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. రైతులకు నష్టం జరగకుండా న్యాయమైన పరిహారం అందిస్తామని అన్నారు. అభిప్రాయాల సేకరణ అనంతరం జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. భూమికి భూమి ఇవ్వాలని కొందరు రైతులు పేర్కొనగా, ఉద్యోగం ఇవ్వాలని కొందరు, కొడంగల్ తరహాలో నష్ట పరిహారం చెల్లించాలని మరికొందరు డిమాండ్ చేశారు. కొందరేమో భూములు కోల్పోతున్న లిస్టులో తమ పేర్లు లేవని పేర్కొన్నారు. గ్రామ సభలో తహసీల్దార్ చింత రవి, ఇరిగేషన్ ఈఈ సురేష్, వెంకటప్ప, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు

దామరగిద్ద, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందుతుందని కానుకుర్తి హైస్కూల్ హెచ్‌ఎం అన్నపూర్ణ, జీపీఎస్ హెచ్‌ఎం శేర్ కృష్ణారెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందుతుందన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు, నోటుబుక్కులు అందిస్తున్నామని, నాణ్యమైన మధ్యాహ్న భోజన సౌకర్యం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో కలిసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో పంపిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు భీంరెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, రవికుమార్, తిరుపతయ్య, కవిత, మౌనిక, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో బాలుడి మృతి

కృష్ణ, మాగనూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన సంఘటన మాగనూరు మండలం మందిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి క్యూరింగ్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్ తగిలి భానుప్రకాష్(14) మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. బాలుడి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదం నెలకొంది.

## ఘనంగా భవానీ, సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠ

నారాయణపేట రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మండలంలోని ఊటకుంట తండాలో శుక్రవారం తుల్జాభవానీ, సంత్ సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మూడ్రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించి శుక్రవారం వేద మంత్రోచ్చరణలతో శాస్త్రీయంగా ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ అమ్మవారికి, సేవాలాల్‌కు పూజలు చేశారు.

## డ్రైనేజీలు నిర్మించాలి



మండల కేంద్రంలో నివాసాల ముందు నిలిచిన వర్షపు, మురుగునీరు

కృష్ణ, మే 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మురుగు కాలువలు లేక వర్షం, మురుగునీరు నివాసాల ముందు నిలుస్తోంది. దీని వల్ల కంపు వాసనతో విసుగు చెందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. వారంరోజులుగా సాయంత్రం నుంచి తెల్లవారుజాము దాకా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వర్షపు నీరు, మురుగు వెళ్లే మార్గం లేక ఎక్కడికక్కడే నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని వారు పేర్కొన్నారు.